చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన

వీరవనిత చాకలి ఐలమ్మ

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, ఆగస్టు 25: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన తరగతుల్లో సామాజిక చైతన్యం రగిలించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పోశమ్మచౌరస్తాలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట పటిమను యావత్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. ఐలమ్మ పోరాటం ఫలితంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనను దహించి వేసిందన్నారు. చాకలి ఐలమ్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చాకలి ఐలమ్మ విగ్రహ దాత డాక్టర్ మోపతయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అనంతారెడ్డి, రజక సంఘం నాయకులు అనిల్‌కుమార్, నర్సింహులు, నిరంజన్, లక్ష్మయ్య, యల్లయ్య, పర్వతాలు, మల్లయ్య, తిరుపతయ్య, జంగయ్య, కృష్ణయ్య ఉన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

వెల్దండ : కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఆగస్టు 25 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైపాల్‌యాదవ్ పాల్గొని పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. పార్టీ శ్రేణులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అనంద్, అశోక్, మల్లేశ్, బీమయ్యగౌడ్, తిర్మల్‌రావు, ప్రసాద్, నిరంజన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 25 : కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మధు, నాయకులు బాలయ్య, జంగయ్య, రుక్నుద్దీనన్, శ్రీనివాసులు, రమేశ్, కిశోర్, రామకృష్ణ, శేఖర్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

వెల్దండ, ఆగస్టు 25 : ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం వెల్దండ రైతు వేదికలో నిర్వహించిన రింగ్ ఫైట్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డకు యుద్ధవిద్య ఎంతో అవసరమన్నారు విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, మట్టవెంకటయ్య, బచ్చు రామకృష్ణ, సంజీవ్‌కుమార్, ఎండీ ఆలీ, కృష్ణ, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్, ఆగస్టు 25 : మండలంలోని సింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 సంవత్సరం పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సింగోటం గ్రామంలోని హరిత హోటల్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో విద్యాబోధనలు చేసిన గురువులను సన్మానించారు. తమ బ్యాచ్‌లో ఎవరైనా కష్టాల్లో ఉంటే ఒకరికి ఒకరు తోడుగా ఉండి కష్టసుఖాలలో పాలుపంచుకోవాలని ఆత్మీయ అభిమానాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ముగించారు. అంతకుముందు ఆట పాటలతో సందడి చేశారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవాలు

- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, కలెక్టర్ సంతోష్

అచ్చంపేటటౌన్: తీజ్ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

కల్వకుర్తి : తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేటరూరల్ : వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

అచ్చంపేటరూరల్/టౌన్, ఆగస్టు 25 : గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్ వేడుకలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన తీజ్ తొమ్మిది రోజుల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ముందుగా బంజార సోదరిసోదరమణులకు తీజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను రక్షించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన భవన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించి గిరిజన యువతి, యువకులు, మహిళలు డిజే పాటలతో ఆడిపాడారు. తీజ్ వేడుకల్లో గువ్వల యూత్‌తో కలిసి డ్యాన్స్ వేస్తూ కుర్రకారులను ఉత్సాహపరిచారు. అనంత రం మండలంలోని నడింపల్లి చెరువుకు చేరుకోని తీజ్ గోదుమ బుట్టలను నిమ్మజనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సేవ సంఘం, ఉద్యోగ సంఘం, యువజన సం ఘం, మహిళా సంఘం నేతలు, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్సైలు, బీఆర్ఎస్ నాయకులు పోకల మనోహర్, తులసీరాం, తండావాసులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్, ఆగస్టు 25 : కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీనగర్‌లో ఆదివారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, నాయకులు హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తీజ్ ఉత్సవాలు గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, ఆనంద్‌కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంపాల్‌నాయక్, నాయకులు హన్మనాయక్, గిరిజన ఉద్యోగులు, తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

కల్వకుర్తిలో బోనాలతో పోచమ్మ తల్లి వద్దకు వెళ్తున్న భక్తులు

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్/చారకొండ, ఆగస్టు 25 : కల్వకుర్తి పట్టణంలో ఆదివారం పోచమ్మ అమ్మవారి బోనాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనం కుండలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. పోచమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా చారకొండ మండలం జూపల్లిలో ఆదివారం గేల్వాలాంబమాత బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం మండల ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్సై రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలతోపాటు, చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పలు సూచనలు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వారు తమ మొబైల్‌కు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన ఓటీపీ చెప్పమంటే వివరాలు ఇవొద్దన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రతలు తీసుకోవాలని ఎస్సై వివరించారు. అదేవిధంగా గతంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఆదివారం రికవరీ చేసిన ఫోన్లను అందజేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకట్‌రెడ్డి, రాజన్ గౌడ్, విష్ణుమూర్తి, మహేశ్, కల్పన, అరవింద్‌రెడ్డి ఉన్నారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర శర్మ

అచ్చంపేటటౌన్, ఆగస్టు 25 : హిందువులు ఐకమత్యంగా ఉండాలని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ అన్నారు. ఆదివారం ఆయన అచ్చంపేట పట్టణంలోని శ్రీభక్త మార్కండేయ ఆలయ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విశ్వ హిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ బంధువులందరూ ఏకంకావలిసిన సమయం ఆసన్నమైందని ఆలస్యం చేస్తే మరెన్నో దారుణాలు చూడాల్సి వస్తుందన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులకు సంబంధించినటువంటి, వ్యాపారస్తులపై జరిగిన దాడులు, మహిళలపై జరిగిన అత్యాచారాలను గుర్తుచేశారు. కుల మతాలకు పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి హిందువులపై దాడు లు జరుగకుండా ప్రతిఘటించాలని సూచించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ అచ్చంపేట ప్రఖండ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మంత్రాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు కోట భాస్కర్, పాపిశెట్టి శ్రీనివాసులు, అనురాధ, సు నీతాబాయి, మాతృశక్తి విభాగ్ ప్రముఖ్ హేమలత, సహాకార్యదర్శులుగా శకుంతల, పాండురంగం, మహేశ్‌చారి, కోశాధ్యక్షులుగా కండె బాలరాజు, ఉప కోశాధికారిగా కర్ణస్వామి, భజరంగదళ్ ప్రముఖ్ శివచంద్ర ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకరయ్య, ప్రమోద్‌ప్రసాద్ సింగ్, వెంకటేశ్, శ్రీను, శాయిలీల, మురళి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నిలిపివేత

కోడేరు, ఆగస్టు 25 : మండలంలోని తీగలపల్లి సమీపంలోని శ్రీవీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ కట్టపై ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో కోడేరు మండలానికి 15 రోజులుగా ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షాలకు వీరభద్రస్వామి ఆలయం సమీపంలో ఉన్న రోడ్డు బురదమయంగా మారింది. వాహనాలు వెళ్లడానికి అసౌకర్యంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు కొల్లాపూర్ డిపోకు చెందిన బస్సులను ఈ రూటులో నిలిపివేశారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును వెంటనే మరమ్మతులు చేయించి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు భక్తి మార్గం అలవర్చుకోవాలి

అచ్చంపేటటౌన్, ఆగస్టు 25 : విద్యార్థులకు విద్యతో పాటు భక్తి మార్గం అలవర్చుకోవాలని హరేకృష్ణ సెంటర్ నిర్వాహకుడు మహేశ్‌ప్రభు అన్నారు. ఆదివారం పట్టణంలో భ్రమరాంబ ఆలయంలో విద్యార్థులకు కాంపిటిషన్ పరీక్షలు ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులకు శ్రీ కృష్ణునిపై వ్యాసరచన, డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించి కృష్ణాష్టమి వేడుకల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హరేకృష్ణ సెంటర్ కమిటీ సభ్యులు రాజశేఖర్, పరమేశ్వర్, మురళి పాల్గొన్నారు.

టీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు

కల్వకుర్తి, ఆగస్టు 25 : తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న పాలమూరులో వీవీ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర విద్యా వ్యవస్థపై సమాలోచన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య తెలిపారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని సావిత్రీ బాయి పూలే బాలికల ఒకేషనల్ కళాశాలలో విద్యా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ నాయకులు యాదయ్య, రాజేందర్, గోపాల్, సదానందం, పరశురాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దండ ఆగస్టు 25 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దండ మండలం ఎర్రపల్లి తండాలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల వివరాల మేరకు ఎర్రపల్లి తండాకు చెందిన ఎం.రాజేందర్ (28) హైదరాబాద్‌లో క్యాబ్ నడుపుకుంటూ జీవనం గుడుపుతున్నాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి ఎర్రపల్లి తండాకు వచ్చిన రాజేందర్ ఆదివారం ఉదయానికి శవమైన కనిపించాడు. తన ఇంట్లో పరుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోపే అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతునికి భార్య రజిత, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 25 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గత కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద ఉచితంగా కరెంటు ఇస్తున్నప్పటి నుంచి కోతలు ఎక్కువయ్యాయని పట్టణ ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ఆదివారం అలాంటి సంఘటనే చోటు చేసుకుంది. విద్యుత్ అంతరాయం కలిగిం చేటప్పుడు ముందస్తు సమాచారం ఇచ్చే అధికారులు ఆదివారం మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఆరు గంటలపాటు నిర్విరామంగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగించారు. మరమ్మతుల పేరుతో పట్టణంలోని 18వ వార్డు ఎలాంటి సమాచారం లేకుండా ఏకంగా ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో వినియోగదారులు మండిపడుతున్నారు. ఆదివారం కావడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. ఏఈని వివరణ కోరగా లైన్ సమస్య ఉండడంతో మరమ్మతులు చేస్తున్నామని సమాధానం ఇచ్చారు.

బాధితకుటుంబానికి ఆర్థిక సాయం

కల్వకుర్తి, ఆగస్టు 25 : కల్వకుర్తి మండలం తర్నికల్ తండాలో అనారోగ్యంతో మృతి చెందిన రాజునాయక్ కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ద్వారా అందించిన ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ నాయకులు గణేశ్ అందించారు. ఆదివారం గ్రామానికి చెందిన నాయకులు రాజునాయక్ మృతి విషయాన్ని దృష్టికి తీసుకురావడంతో ఆయన వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించి భరోసాను కల్పించారు.

ముగిసిన వెంకటలక్ష్మమ్మ ఉత్సవాలు

అమ్రాబాద్, ఆగస్టు 25 : మండల కేంద్రంలో గౌడన్నల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటలక్ష్మమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గౌడన్నలు ప్రతి ఒక్కరూ తమ ఇంటి అమ్మవారికి డప్పుచప్పులతో నైవేద్యాలు సమర్పించి వెండి, బంగారం, వడిబియ్యం, నగదు తదితర రూపాల్లో మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 25 : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకుందామని బీజేవైఎం అసెంబ్లీ కోకన్వీనర్ రాజశేఖర్ కోరారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల దుకాణాన్ని సందర్శించి నిర్వాహకుడిని అభినందించారు. ప్రతిఒక్కరూ ఆలోచించి మట్టి విగ్రహాలకు ప్రాధాన్యతనిస్తూ వాటిని సాంప్రదాయబద్ధంగా పూజించుకుందామని కోరారు.

అభివృద్ధిని విస్మరిస్తున్న ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉప్పునుంతల, ఆగస్టు 25 : కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిని విస్మరించిందని, అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని బీజేపీ మండల నాయకులు విమర్శించారు. సోమవారం ఉప్పునుంతలలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధిపై చర్చకు తమతో కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని వారన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయని విమర్శించారు. సమావేశంలో నాయకులు మహేశ్ యాదవ్, శేఖర్, శివశంకర్, రాజు, మధు, మల్లేశ్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

- సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్

బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 25 : ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్ అన్నారు. ఆదివారం అచ్చంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జెండాలు పట్టుకొని నిరసన తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా రాష్ట్రంలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచలేదన్నారు. బస్సుల సంఖ్యను పెంచకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బస్సు భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు వర్ధన్ సైదులు, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు నిర్మల, రజిత, సైదమ్మ, పార్వతమ్మ, శివలీల, సరస్వతి, పర్వతాలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం తల్లీబిడ్డా క్షేమం

108లో ప్రసవం చేసిన సిబ్బంది

లింగాల, ఆగస్టు 25 : మండలంలోని అవుసలికుంట గ్రామానికి చెందిన పులిజాల అరుణ 108 అంబులెన్స్‌లో ప్రసవమైన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకున్నది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు అవుసలికుంట గ్రామానికి చెందిన పులిజాల అరుణ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో లింగాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా నొప్పులు అధికం కావడంతో అక్కడి వైద్యుల సలహా మేరకు108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లీ బిడ్డను క్షేమంగా జిల్లా దవాఖానకు తరలించడంతో జిల్లా మేనేజర్ బోయిని శ్రీను, ఫైలెట్ వెంకటేశ్, ఈఎంటీ తిరుపతయ్యలను అభినందించారు.

గొర్రెల కాపర్లను అడ్డుకున్న అటవీ అధికారులు

అమ్రాబాద్, ఆగస్టు 25 : పదర మండలంలో గొర్రెల కాపర్లను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణ వినిపించాయి. గొర్రెల కాపర్లు తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర ప్రాంతానికి చెందిన గొర్రెల కాపర్లు తమ గొర్రెలను మేపడానికి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పదర మండల అటవీ సమీపానికి నాలుగు రోజుల కిందట వచ్చామన్నారు. వచ్చిన రోజు అడ్డు చెప్పని అధికారులు ఇప్పుడు మమ్మల్ని అడవి నుంచి బయటకు వెళ్లమని హెచ్చరిస్తూ దాడులు చేశారని వారు ఆరోపించారు. సుదూర ప్రాంతం నుంచి గొర్రెలను మేపేందుకు వచ్చిన తమపై దయ కల్పించాలని వారు అధికారులను కోరారు.

రుణమాఫీపై మాయమాటలు తగదు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు గీత

సమావేశంలో మాట్లాడుతున్న గీత

నాగర్‌కర్నూల్, ఆగస్టు 25 : రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు తగవని, రైతులందరికీ రుణమాఫీ చేశామంటూ రైతాంగాన్ని ప్రభుత్వం మోసం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని నిర్వహించారు. చేసిన రుణమాఫీకీ కూడా అనేక ఆంక్షలు, నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న రుణమాఫీ కేవలం 44శాతం మందికి మాత్రమే మాఫీ అయ్యాయని, మిగతా 56 శాతం మంది రైతులు రుణాలు మాఫీకాక, ప్రభుత్వం విధించిన కొర్రీలతో సతమతమవుతున్నారన్నారు. ఏదో ఒకసాకు చెప్పి రుణమాఫీ కాలేదని చెబుతున్నారని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశామని, ఏఈవోలతో సమాచారం తెలుసుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం మాయమాటలతో కాలం గడుపుతున్నదని, తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని లేనిపక్షంలో రైతుల కోసం పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యులు మోహన్, నాగరాజు, సుభాష్, శ్రీలక్ష్మి, మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు

కల్వకుర్తి, ఆగస్టు 25 : పట్టణంలోని మిలినియం పాఠశాలలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల అలంకరణతో అలరించారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

భూమి పూజ చేస్తున్న నాయకులు

చారకొండ, ఆగస్టు 25 : మండలంలోని చంద్రాయన్‌పల్లిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నేత ఆచారి ముఖ్య అతిథిగా హాజరై శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల గ్రామ బీజేపీ నాయకులను ఆచారి అభినందించారు. అనంతరం గ్రామంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, దుర్గప్రసాద్, రవి నాయక్, వెంకట్‌గౌడ్, కిరణ్, కుమార్, కార్యకర్తలు ఉన్నారు.